

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## – కస్తూరి మురళీకృష్ణ

దిల్ జో న కహసకా, వహీ రాజ్ – ఎ – దిల్

కహనే కి రాత్ ఆయు....

'భీగీరాత్' సినిమాలో మహమ్మద్ రఫీ అత్యద్భుతంగా పాడిన ఈ పాటను తలచుకోగానే గుండెల్లోంచి నిట్టూర్పు వెలువడుతుంది. అత్యద్భుతమైన పాట. గొప్ప కవిత్వం. పాటలోని భావం సందర్భోచితమే కాదు, ప్రేమలో మోసపోయిన ప్రతి వ్యక్తి హృదయానికయిన గాయానికి రాసే లేపనంలాంటి పాట ఇది. 'యమన్ కళ్యాణ్' రాగంలో సంగీత దర్శకుడు రోషన్ సృజించిన ఈ పాట ఈనాటికీ శ్రోతలను అలరిస్తోంది. ప్రేమ భావాల సున్నితత్వాన్ని, భగ్నప్రేమలోని ఆవేశాన్ని ప్రస్ఫుటం చేస్తోంది.

పాత సినిమాలలో ఇలాంటి సన్నివేశాలుండేవి. నాయకా నాయకులు ప్రేమించుకునేవారు. పెళ్లి చేసుకోవాలనుకునేవారు. నాయిక కోసం నాయకుడు ఎదురు చూస్తూండేవాడు. పారిపోయి పెళ్లి చేసుకునేందుకు ఒప్పుకున్న నాయిక వచ్చేది కాదు. దాంతో నాయకుడి మనస్సు విరిగిపోయేది. పైగా ఆమె తనని కాదని ఓ ధనవంతుడిని వివాహమాడుతుందని తెలిస్తే నాయకుడు ఆమెపై కోపం, ద్వేషం పెంచుకుంటాడు. ఏదో ఓ సందర్భంలో నాయికా నాయకులు తటస్థపడతారు. అప్పుడు నాయకుడు ఆమె తనని మోసం చేసిందన్న కసి అంతా పాట రూపంలో ప్రదర్శిస్తాడు. తన ద్వేషాన్ని క్రోధాన్ని పాటలో వ్యంగ్యంగా, కత్తిలా పొడిచే భావంతో ఆమెని బాధిస్తాడు.

భీగీరాత్ సినిమాలో అలాంటి సందర్భంలో వస్తుందీ పాట. సంబరాలు జరుగుతూంటాయి. నాయకుడు వస్తాడు. బాల్కనీలో కూర్చుని సంబరాలను తిలకిస్తున్న నాయికను చూస్తాడు. ఎద భగ్గుమంటుంది. పాట అందుకుంటాడు. 'దిల్ జో న కహసక, వహీ రాజ్ – ఎ – దిల్, కహనే కి రాత్ ఆయి' అంటూ – హృదయం ఇంతవరకూ చెప్పలేని రహస్యాలను వెల్లడించే రాత్రి ఇదే' అంటూ పాటను ప్రారంభిస్తాడు.

ఈ పాట బాణీ అతి గొప్పగా ఉంటుంది. కానీ బాణీ మెలికలలో ఒదుగుతూ గేయ రచయిత మజ్రూహ్ సుల్తాన్పురి ప్రదర్శించిన భావాలు పాట స్థాయిని వందరెట్లు పెంచితే, రఫీ తన స్వరంలో పలికించిన భావాలు పాట ప్రభావాన్ని వెయ్యిరెట్లు పెంచుతాయి. ఈ పాటలో మజ్రూహ్ రచనలో గొప్పతనం అర్థం అవాలంటే మరో సందర్భంలో లతామంగేష్కర్ పాడిన ఇదే పాటను వినాల్సి ఉంటుంది. ఆ పాటలో వాడిన పదాలు, భావాలు గమనించాల్సి ఉంటుంది. అప్పుడు మహమ్మద్ రఫీ పాటలోని హేళన, ఎత్తిపొడుపులు, ఆవేదన మరింత స్పష్టమవుతాయి.

లత పాడిన 'దిల్ జోన కహసక' పాట సందర్భం కూడా పాత సినిమాలలో అలవాటయినదే. నాయిక నాయకులు విహారానికి వెళ్తారు. వర్షం పడుతుంది. ఇద్దరూ తడుస్తారు. ఒకచోట తలదాచుకుంటారు. వేడికోసం నిప్పురాజేస్తారు. తడిసిన దుస్తులు విడిచి వేరే దుస్తులు కట్టుకున్న నాయక తన మనసులో నాయకుడి పట్ల ప్రేమ భావనను, ఆకర్షణను, శారీరక స్పందనను తెలియచేస్తూ పాడుతుంది.

దిల్ జో న కహ సక

వహీ రాజ్ – ఎ – దిల్,

కహెనేకి రాత్ ఆయీ....

అవే పదాలు. అదే భావన. కానీ అర్థం మారిపోయింది. పూర్తి వ్యతిరేకమైన భావం. ఇక్కడే గేయ రచయిత గొప్పదనం తెలిసేది.

వర్షంలో చిక్కిన ప్రేయసీ ప్రియులు పాట పాడే సందర్భంలో నాయిక తన మనసులో ఉన్నా పైకి చెప్పలేని రహస్యాన్ని చెప్పేసే రాత్రి వచ్చింది అంటుంది. నాయిక తనను మోసం చేసి మరొకడిని వివాహమాడిందన్న కసితో, ఆమె కనబడగానే నాయకుడు కసితో, బాధతో, పాట అందుకుంటాడు. 'ఏదైతే ఇన్నాళ్లూ చెప్పలేక పోయానో ఆ రహస్యం చెప్పే రాత్రి వచ్చేసింది. ఇద్దరూ వాడిన పదాలు ఒకటే. రాజ్ – ఎ – దిల్ అంటే హృదయంలోని రహస్యం. హృదయానికి చెందిన రహస్యం. అలాంటి రహస్యాన్ని చెప్పే రాత్రన్నమాట. ఇద్దరూ అన్నది ఒకటే. కానీ సందర్భాన్ని బట్టి, అన్న విధానాన్ని బట్టి అర్థం మారిపోతుంది. లతా మంగేష్కర్ రొమాంటిక్గా అల్లరిగా అంటుంది. ఆమె వెల్లడించబోయే మనసులోని మాట అలాంటిది. అదే మహమ్మద్ రఫీ దగ్గరకు వచ్చేసరికి అవి పదాలు గంభీరమైన అర్థాన్ని సంతరించుకుంటాయి. ఆవేదన, ఆక్రోశం, ఆవేశాలతో నిండి ఒకరకమైన బరువును సంతరించుకుంటాయి. హృదయంలో వేదనను కలిగిస్తాయి.

రచయిత పల్లవిని రాయటమే రెండు సందర్భాలకు తగ్గట్టు రాశాడు. సంగీత దర్శకుడు బాణీని రెండు సందర్భాలకు తగ్గట్టు సృజించాడు. ఇక్కడ ఆయా విభిన్నమైన సందర్భాలను స్ఫురించేట్టు పాడటం గాయకుల వంతయితే, అందుకు తగ్గ మూడ్ను సృజించటం వాయిద్యాల వంతు. లత పాడిన పాట ఆరంభానికి ముందు వినిపించే వాయిద్యాలు శృంగార భావాన్ని తలపింపచేస్తూ, seductiveగా ఉంటే రఫీ పాట ముందు మధ్యలో వాయిద్యాలు గాంభీర్యాన్ని, ఉద్వేగాన్ని తలపింపచేస్తాయి. సందర్భాన్ని ఉద్దీపితం చేస్తాయి.

నాయకుడిని అలరిస్తూ నాయిక పాడిన పాట శృంగారభరితం.

నగ్మా స కోయీ జాగ్ ఉఠా బదన్మే
ఝన్కార్ కేసీ థర్ థరీ హై తనమే
ప్యార్ కీ ఇస్పీ ధడక్తీ ఫిజావోమే
రహనేకి రాత్ ఆయీ

సుందరమైన భావం. ఒక గీతం ఆమె శరీరంలో జాగృతం అయింది. ఆ గానం ప్రకంపనలు ఆమెశరీరంలో ఏదో స్వరం పలికిన భావన కలిగి కంపించిందా పాట. ఇలాంటి ప్రేమకు స్పందించే వాతావరణంలో ఉండే రాత్రి వచ్చింది. శృంగార భావనను ప్రకటిస్తోంది నాయిక.

అబ్తక్ దబీథీ ఏక్ మౌజ్ – ఎ – అర్మాన్
అబ్ లేకే ఆయీ బన్ గయీ హై తూఫాన్
బాత్ ప్యార్కీ బహక్తే నిగాహోంసె
కహనేకి రాత్ ఆయీ...

ఇంతవరకూ ఆమె హృదయంలో కోరికల స్రవంతి అణచిపెట్టి ఉంది. ఒక్కసారి అది పెదిమలపైకి వచ్చేసరికి తుఫాను వచ్చినట్టయింది. ప్రేమమాటలను మత్తు కళ్ళతో పలికే రాత్రి వచ్చింది అంటోంది. అద్భుతమయిన భావనను అంతే అద్భుతమైన పదప్రయోగంతో ప్రకటిస్తున్నాడు గేయరచయిత. ముఖ్యంగా 'ప్రేమ భావనలు కళ్లతో పలికే రాత్రి' అన్నప్పుడు నాయిక వదనంలో కదిలే భావం పరమాద్భుతం. అందుకే ఆ కాలం నటీమణులు గొప్ప నటీమణులుగా ప్రసిద్ధి పొందారు.

గుజ్రే న యే షబ్, ఖోల్ దూ యె జుల్ఫే
తుం కో చుపాలూ మూంద్ కే యె పల్కే
బేక్రార్ సీ లరజ్ తీ సి బాహోమే
రహనే కి రాత్ ఆయీ..

ఈ రాత్రి గడచిపోవద్దు. నా వెంట్రుకల ముడి విప్పుతాను. అంటే, ఆమె కురులు విప్పితే రాత్రి అవుతుందన్నమాట. కవి 'కురులు విప్పితే రాత్రి' అవుతుందని కవితాత్మకంగా చెపుతూ కురులు విప్పటంలోని శృంగార భావనను అత్యద్భుతంగా అణచిపెట్టగలిగాడు. అతి గొప్ప రచనా సంవిధానం ఇది. కైఫీ ఆజ్మీ ఓ పాటలో 'తుమ్హారె జుల్ఫ్ కె సాయేమె షాం కర్లూంగా' అంటాడు. అంటే, ఆమె కురుల నీడలు సాయంత్రం సృజిస్తాయట, వాటివల్ల అతను సాయంత్రం చేసుకుంటాడట. గొప్ప శృంగార భావం. కానీ 'కురులు విప్పటం ' కన్నా అధికమైన భావుకత అది. మజ్రూహ్ మరో పాటలో 'యే హై రేష్మీ జుల్ఫోంకా అంధేరా న ఘబ్రాయియే' అనిపిస్తాడు. అది ఆమె కురులు విప్పటం వల్ల అయిన చీకటి, దానికి భయపడవద్దంటోంది. ఇక్కడ కురులు విప్పటంలోని seduction స్పష్టమవుతుంది. తరువాతి పాదంలో చీకటి ఉన్నా ఎంతవరకూ ఆమె కురుల పరిమళం ఉందో దాని ఆధారంగా తన దగ్గరకు వచ్చేయమంటుంది. అత్యంత సంస్కారవంతంగా అతిగొప్ప శృంగార భావనను ప్రదర్శించాడు. అదే భావన ఇక్కడ నాయిక రాత్రి గడవకూడదని కురులు విప్పుతానంటోంది. ఆమె ఆత్మవిశ్వాసం కూడా తెలుస్తోంది ఈ భావనవల్ల. ఆమె కళ్లు మూసుకుని అతడిని తన కళ్లల్లో దాచుకుంటుందట. కరార్ అంటే శాంతి, బేకరార్ అంటే అశాంతి. ఇది ప్రేమలోని అశాంతి. అలాంటి అశాంతితో కంపించే నీడలో ఉండే రాత్రి వచ్చిందంటోంది నాయిక. అద్భుతమైన రీతిలో భావాన్ని వ్యక్తపరచాడు గేయ రచయిత.

హిందీ సినీ గేయ విమర్శకులు సాహిర్, శైలేంద్రల పేర్ల తరువాతనే మజ్రూహ్ పేరును తలుస్తారు. సాహిర్ వ్యక్తిత్వం, శైలేంద్ర గేయ రచనా సంవిధానం వెలుగుల్లో వారు మజ్రూహ్ ను విస్మరిస్తారు. మజ్రూహ్ నీటి వంటివాడు. తన వ్యక్తిత్వాన్ని, ప్రత్యేకతను సందర్భంలో ఒదిగింపచేసి ఆ పరిధిలోనే తన కలంతో విశృంఖల విహారం చేశాడు. కానీ నీరు ఎంత అవసరమైనదైనా పాలకు, కొబ్బరి నీళ్లకు ఉన్న విలువ నీటికి ఉండదు .అది లేనప్పుడే దాని విలువ తెలుస్తుంది. మజ్రూహ్ కూడా అంతే.

లత పాటను పాటలో భావాన్ని, పద ప్రయోగాన్ని గమనించిన తరువాత రఫీ పాటను వింటే మజ్రూహ్ చమత్కారం అర్ధమవుతుంది పల్లవి ఎలాగయితే రెండు పాటలకూ ఒకటేనో, రఫీ పాటలో చరణంలో ఆరంభం రెండు పాదాలూ అవే.

**నగ్మా స కోయీ జాగ్ ఉఠా బదన్మే**

**ఝున్ కార్ కీసీ ధర్ ధరీహై తన్మే**

నాయిక అన్నట్టే ఇప్పుడు నాయకుడు అంటున్నాడు. ఆమె అతడిని ప్రేమించినపుడు అన్న మాటలను ఇప్పుడూ ఆమె వేరే వాడిని వివాహం చేసుకున్నప్పుడు నాయకుడు ఆమెపైనే ప్రయోగిస్తున్నాడు. మాటలతో గుచ్చటం అంటే ఇదే.

ఇప్పుడు ఆమెని చూస్తూంటే కూడా అతని శరీరంలో ఓ పాట జాగృతం అయింది. శరీరంలో కంపనం కలిగించింది. జలదరింపచేసింది. అవే పదాలు పూర్తిగా విరుద్దమైన భావన. మాటలతో గుచ్చటం ఇంతటితో అయిపోయిందనుకుంటే పొరపాటు. ముందు ఇంకా మాటల బల్లాలు, శూలాలు ఉన్నాయి.

**ముబారక్ తుమ్హే కిసీకీ లరజ్తీ బాహోమే**

**రహనేకి రాత్ ఆయీ..**

'లరజ్తీ' అన్న పదం ఇక్కడ ప్రాధాన్యం వహిస్తుంది. లరజ్తీ అంటే స్పందించటం, కంపించటం... మరో అర్ధంలో ప్రేమతో కంపిస్తూన్న అన్న అర్ధం వస్తుంది. నాయకుడు ఆమెకు అభినందనలు తెలుపుతున్నాడు. ఎందుకంటే ఆమె కూడా ఎవరి కంపించే బాహువుల్లోనో ఒదిగే రాత్రి వచ్చింది కాబట్టి నాయిక ఏమో 'స్పందించే నీడ' అంది. అది అస్పష్టం. ఇప్పుడు వారి ఎదురుగా ఉన్నది నిజం. చేదు నిజం. అందుకని 'బాహోమే' అన్నాడు నాయకుడు. 'ముబారక్ తుంహే కిసీకీ' అనటంలోనే 'మొత్తానికి ఎవరో ఒకరిని పెళ్లి చేసుకున్నావన్నమాట' అన్న తూష్ణీం

భావం ఉంది. 'నన్ను మోసం చేశావు ... ఇప్పుడు ఎవరిని పట్టావు?' అన్న తిరస్కారం ఉంది. నటుడు ప్రదీప్ కుమార్ మొహం భావరహితంగా ఉంటుంది. భావాలు పలికేది రఫీ స్వరం. ఆమె వాడిన పదాలతో ఆమెనే తూట్లు పొడుస్తున్నాడు నాయకుడు.

**తౌబా యే కిస్నే అంజుమన్ సజాకే**

**టుకడే కియే హై గుంచ – ఎ – వహాకే**

**ఉఛాలో గులోం కె టుక్డే కె రంగీన్ ఫిజూవోమే**

**రహనేకి రాత్ ఆయీ...**

అద్భుతం. అక్కడ సంబరాలు జరుగుతున్నాయి. ఆమె వివాహవేడుకలు. అందుకోసం అంతా అందంగా అలంకరించారు. ఆ అలంకరణ కోసం వాళ్లు విశ్వాసం అనే కొమ్మలను విరిచి వేశారు. విశ్వాసం అనే పూల గుత్తులను విరిచి, ఆ పూలతో అలంకరించారు. అంటే, అతడి విశ్వాసాన్ని విరిచి, ఆమె ఇక్కడ వేడుకలో అలంకరించిందన్నమాట. అద్భుతం! అందుకే ఏమీ తెలియనట్టు అడుగుతున్నాడు. ఎవరు నమ్మకమనే పూలగుత్తులను విరిచి ఇక్కడ అలంకరించారని? అంతటితో ఆగటంలేదు. అందమైన వాతావరణంలో, రంగు రంగు దృశ్యాలలో ఉండే రాత్రి వచ్చింది కాబట్టి పూల రెక్కలను విరిచి ఎగరేయండి అంటున్నాడు. ఎంత కసి!

**చలియే ముబారక్ జష్న్ దోస్తీకా**

**దామన్ తొ థామా ఆప్నే కిసీకా**

**హమేతో ఖుషీయహీహై, తుమే భీ కిసీకొ అప్నా**

**కహనేకి రాత్ ఆయీ...**

మరీ దారుణమైన తిట్లు. తిట్టినట్టు లేదు. అభినందనలు తెలుపుతున్నట్టు ఉంది. కానీ అర్ధమైన వారికి గుండెలో శూలాలు గుచ్చి మెలితిప్పుతున్నట్టు ఉంటుంది. ఎవరో ఒకరిని తనవారు అనే రాత్రి వచ్చింది కాబట్టి ఆమెకు శుభాభినందనలు చెప్తున్నాడు. మొత్తానికి ఎవరో ఒకరి చేయి పట్టుకున్నందుకు అభినందనలు చెప్తున్నాడు. కసి, ఉక్రోషం...బాధ కలగలసిన రీతిలో రఫీ అద్భుతంగా గానం చేసి పలు విభిన్నమైన భావాలను పలికిస్తాడు. విభిన్నమైన భావాలు స్ఫురింపచేసే పదాల శక్తిని సంపూర్ణంగా ప్రదర్శిస్తాడు.

**సాగర్ ఉఠాఓ, దిల్ కొ కిస్ కొ గం హై**

**ఆజ్ దిల్కి కీమత్ జాం సే భీ కం హై**

**పియో చాహె ఖూన్ – ఎ – దిల్ హో,**

**కె పీతే పిలాతేహీ..**

సాగర్ అంటే మధుపాత్ర. మధుపాత్రను అందుకో అంటున్నాడు. ఛీర్స్ చెప్తున్నాడన్నమాట. హృదయం గురించి బాధ ఏవరికీ లేదంటున్నాడు. ఈ హృదయం విలువ మధువు కన్నా తక్కువ అంటున్నాడు. ఒకోమాట గుండెల్లో గునపాలు దింపినట్టుంటుంది. నాయికను బహిరంగంగా దూషిస్తున్నాడు. అది ఆమెకూ అతనికీ తప్ప మూడో వ్యక్తికి తెలియదు. అర్ధంకాదు. ఇంతటితో ఆగటంలేదు. ఎంత కావాలంటే అంతే రక్తం తాగమంటున్నాడు. మామూలు రక్తం కాదు. ఖూన్ – ఎ –దిల్... ఎందుకంటే తాగుతూ తాగించే రాత్రి వచ్చింది కాబట్టి ... ఆమె తమకు ద్రోహం చేసి తనని జీవచ్ఛవం చేసి, తన ప్రేమను చంపి, మరొకరి ప్రేమ స్వీకరించిందన్న వేదనను చివరి చరణంలో స్పష్టం చేస్తున్నాడు నాయకుడు.

ఇక్కడ పాట చిత్రీకరణలో చమత్కారం చేస్తారు. నాయకుడు మధుపాత్ర గురించి, హృదయం విలువ గురించి పాడుతూ మరోవైపు చూస్తాడు. ఆ సమయంలో అశోక్ కుమార్ పాత్ర వచ్చి 'వీల్చైర్ 'లో ఆమెను తీసుకువెళ్తాడు. నాయకుడు ఇది చూడడు. పీతే పిలాతేహీ.అని ఈ

వైపుకు చూడగానే ఆమె కుర్చీ ఖాళీగా కనిపిస్తుంది. పాట ఆగిపోతుంది. కేవలం సంగీతం వస్తుంది.వహీ రాజ్– ఎ– దిల్, కహెనే కి రాత్ ఆయీ.. అని ఆపేస్తాడు. ఇక్కడ నాయకుడికి అసలు రహస్యం తెలియదు.

అతడిని కలవటానికి వస్తున్న ఆమెకు ప్రమాదం జరిగి కాళ్లు విరుగుతాయి. ఇది నాయకుడికి తెలియదు. ఆమె తనని మోసం చేసి వేరే వాడిని పెళ్లి చేసుకుందని పొరపడతాడు. కసికసిగా పాట పాడతాడు. కానీ ఆమె కనబడకపోయిన తరువాత పాట ఆపి వహీ రాజ్ – ఎ – దిల్ అనటంతో రహస్యం ఇంకా చెప్పలేదన్న భావన కలుగుతుంది. ప్రతి సన్నివేశం, ప్రతి పదం అర్థం చేసుకుని ప్రతి దృశ్యాన్నీ రూపొందించిన ఆనాటి కళాకారులకు జోహార్లర్పించాలనిపిస్తుంది. ముఖ్యంగా, ఒక పాటను రెండు విభిన్నమైన సందర్భాలలో వాడాల్సి వస్తుందని తెలిసి, ఒకే పల్లవి వేర్వేరు భావాలు స్ఫురించేట్టు రచించింది, అవే పదాలు, అవే భావాలతో ఎత్తి పొడుస్తూ పాటను రచించిన గేయ రచయిత సృజనాత్మక శక్తికి జోహార్లు అర్పించాలనిపిస్తుంది. అందుకే ఇలా నిజాయితీగా, చిత్తశుద్ధితో, సంపూర్ణ సృజనాత్మక పటిమతో సృజించిన పాటలు ఎన్నిమార్లు విన్నా తనివి తీరదు. విన్న ప్రతిసారీ సరికొత్త భావనలు కలుగుతూంటాయి. కొత్త అర్థాలు స్ఫురిస్తూంటాయి.

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments